క్లుప్తంగా

పిల్లల చదువులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మునగపాక హైస్కూల్ కమిటీ చైర్మన్ సూర్యచంద్రరావు

మునగపాక: విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని మునగపాక హైస్కూల్ కమిటీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. చెడు వ్యసనాలకు గురికాకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పదిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ బొడ్డేడ గిరిజ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు జానకమ్మకు బదిలీ



కోటవురట్ల: స్థానిక తహసీల్దారు జానకమ్మకు బదిలీ అయ్యింది. ఉమ్మడి విశాఖ రెవెన్యూ శాఖలో బదిలీలు చేపట్టారు. ఈ మేరకు ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు జానకమ్మకు విశాఖ జిల్లా ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యింది. ఎన్నికల ముందు శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లగా, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తహసీల్దార్లు యథాస్థానాలకు చేరుకున్నారు. తాజాగా చేపట్టిన బదిలీల ప్రక్రియలో జానకమ్మకు స్థానచలనం తప్పలేదు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



కలుపు తవ్వుతున్న కూలీలు

కోటవురట్ల: వాతావరణం అనుకూలంగా ఉండడంతో పొలం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వివిధ పంటల్లో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తున్నారు. వ్యవసాయ పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు. వరిచేలు, సరుగుడు మొక్కల్లో కలుపుతీత పనులు నిర్వహిస్తున్నారు. వరికి తెగుళ్లు ఆశించకుండా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1650 హెక్టార్లలో వరి నాట్లు వేశారు.

మట్టి ట్రాక్టర్ సీజ్



పట్టుబడ్డ మట్టి ట్రాక్టర్

మునగపాక: ఎటువంటి అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం మునగపాక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చూచుకొండ గ్రామ సమీపంలో ఎటువంటి రికార్డులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు.

స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక: రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం పేరుతో ప్రణాళికలు రూపొందించారని ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 పోస్టర్లను సోమవారం ఆయన స్థానిక గ్రామ సచివాలయం వద్ద విడుదల చేశారు. సుస్థిర ప్రభుత్వం – డిజిటల్ సుపరిపాలన పేరుతో చంద్రబాబునాయుడు విజన్‌గా పేర్కొన్నారు. వచ్చేనెల 5వ తేదీ వరకు అందరం కలిసికట్టుగా ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలని ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, పెద్దలు దాడి శివ పాల్గొన్నారు.

ఉరకలేసిన క్రీడోత్సాహం

అట్టహాసంగా మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం



స్కూల్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనుబాబు



వాలీబాల్ ఆడుతున్న బాలికలు

రాంబిల్లి (యలమంచిలి): విద్యార్థుల్లో మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని రాంబిల్లి జెడ్పీటీసీ ధూళి నాగరాజు అన్నారు. ఆయన ఎంపీపీ గొల్తుముక్కల శిరీష భర్త వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనుబాబుతో కలసి మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను సోమవారం అట్టహాసంగా ప్రారంభించారు. రాంబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన ఈ పోటీల్లో మండలంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ నాగరాజు, శ్రీనుబాబు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడతాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఆడుదాం – ఆంధ్రా పోటీలు నిర్వహించి ప్రతిభ కలిగిన గ్రామీణ క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తీర్చిదిద్దారన్నారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించిన ఘనత అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. రాంబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం. వేణుగోపాల్, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ, వివిధ పాఠశాలల పీఈటీ, పీడీలు, పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న బాలికలు

విజేతలు వీరే...

అత్యంత రసవత్తరంగా జరిగిన స్కూల్ గేమ్స్‌లో 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారని రాంబిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. తొలి రోజు విజేత జట్ల వివరాలు వెల్లడించారు. ఖోఖోలో అండర్ -17 బాలికల విభాగంలో రాంబిల్లి, కొత్తపట్నం, అండర్ -14 విభాగంలో రాంబిల్లి, మూలజంప, అండర్-17 బాలికల విభాగం వాలీబాల్‌లో పంచదార్ల, కొత్తపట్నం, అండర్ -14 బాలికల విభాగంలో పంచదార్ల, దిమిలి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. విజేత జట్లు ఈ నెల 28న అచ్యుతాపురంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మునగపాక: గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంపీపీ మళ్ల జయలక్ష్మి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఓటమిని సవాల్‌గా తీసుకొని విజయం కోసం శ్రమించాలన్నారు. రోజూ క్రీడా సాధన చేయడం ద్వారా బహుమతులను కై వసం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. హైస్కూల్ హెచ్‌ఎం జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్, పెద్దలు కాళ్ల చంద్రమోహన్, మారిశెట్టి వెంకటరమణ, ఆడారి సాంబమూర్తి, పలు పాఠశాలల పీటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ జయలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో 'స్వచ్ఛతా హీ సేవ'

నక్కపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు, పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేశారు. ఆవరణలో చెత్తను, పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతాఖామరాజు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఆస్పత్రి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, స్థానిక నాయకులు, ఆస్పత్రి సిబ్బంది ఇమామ్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

హోం మంత్రికి వినతుల వెల్లువ

ఎస్.రాయవరం: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో హోం మంత్రి అనితకు సమస్యలు వెల్లువెత్తాయి. పి.ధర్మవరంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వినతిపత్రాలు అందజేశారు. వరాహనది పరివాహక గ్రామాల్లో భయంతో నివసించాల్సి వస్తుందని, గట్లు పటిష్టపరచాలని పలువురు విన్నవించారు. .

దర్మవరం అగ్రహారం ఉన్నత పాఠశాలలో 2014 తర్వాత నిర్మించిన ప్రహరీ అసంపూర్తిగా ఉందని, వెంటనే పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరారు. జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో డీఈవో పూల్ పండితుల సమస్యపై దృష్టి సారించి పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. త్వరలో మూలపాలెం గ్రోయిన్ మరమ్మతులు, వమ్మవరం రోడ్డు నిర్మాణం, వరాహనది గట్టు పటిష్టతపై దృష్టి సారించి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సంపద కేంద్రాలతో అదనపు ఆదాయం

మునగపాక: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి తెలిపారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. పల్లపు ఆనందపురంలోని సంపద తయారీ కేంద్రంలో వానపాములను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా వర్మీ అమ్మకాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి అప్పయమ్మ, పంచాయతీ కార్యదర్శి భానుప్రియ, పెద్దలు పెదబ్బాయి, ఉస్తేల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వానపాములు విడుదల చేస్తున్న ఈవోపీఆర్డీ వెంకటలక్ష్మి

ఐదేళ్లలో 15 శాతం వృద్ధి రేటుకు ప్రణాళికలు

రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి శశికళ



మాట్లాడుతున్న రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి శశికళ

అనకాపల్లి: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 15 శాతం వృద్ధి రేటు సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ గణాంకాల అధికారి ఎం.శశికళ తెలిపారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం మేడపైన జీవీఎంసీ, మండల పరిషత్, తదతర శాఖల మండల స్థాయి అధికారులతో ఆమె మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో పట్టణ, మండల స్థాయిలో విజన్ ప్లాన్‌పై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రగతి కోసం 15 రకాల రంగాలు ఉన్నట్టు తెలిపారు. ప్రధానంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉద్యాన పంటలు, పాడి పరిశ్రమ, మత్స్య, స్త్రీ శిశు సంక్షేమం, పరిశ్రమ, టూరిజం, సంక్షేమ వసతిగృహాలు, తాగునీరుతో పాటు ఇతర రంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2023-24 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరానికి సాధించడానికి ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు ఒక పుస్తకం రూపంలో తయారు చేసి 2024-29 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్ ప్లాన్‌పై అధికారులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, ఎంపీడీవో కె.వి.నరసింహరావు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సౌజన్య, మండల ఏఎస్‌డీపీవో శశికళ, ఎంఈవో-2 కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి: మూడు కేజీల గంజాయి తరలిస్తున్న వ్యక్తిపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలో రామాపురం గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన నీలగిరి హరీష్ తన బైక్‌పై మూడు కేజీలు గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. చిన్నచిన్న ప్యాకెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలడంతో అరెస్టు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: పురుషోత్తపురం 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రం 11 కేవీ పేరంటాళ్లపాలెం పీడర్ పరిధిలో లైన్ల నిర్వహణ పనుల కారణంగా మంగళవారం సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. పేరంటాళ్లపాలెం, పులపర్తి కూడలి, విశాఖ బయోమెరైన్ కర్మాగారం ప్రాంతాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలన్నారు.

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనులు కారణంగా మంగళవారం సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ లైనులో చెట్ల కొమ్మల తొలగింపు పనులు నిమిత్తం గోకులపాడు గ్రామానికి ఉదయం 11 నుంచి మధ్యాహ్న 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎస్.రాయవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ కోన లోవలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు గత సమావేశ తీర్మానాలు, పరిష్కరించిన పనులు, కొత్తగా ప్రభుత్వం ఆయా శాఖల్లో చేపట్టిన వివరాలతో నివేదికలు తీసుకుని సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

కారు డ్రైవర్‌కు గాయాలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం దరి సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. అచ్యుతాపురం నుంచి పరవాడ వైపు వెళ్తున్న కారును ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొంది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రున్ని స్థానికంగా ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పట్టణ ఎస్‌ఐగా ఈశ్వరరావు

అనకాపల్లి: పట్టణ ఎస్‌ఐగా దాసరి ఈశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చారు.

ఇంగ్లిష్ టీచర్‌ను మార్చాలని ప్లస్-2 విద్యార్థినుల ఆందోళన



తరగతులు బహిష్కరించి బైఠాయించిన విద్యార్థినులు

యలమంచిలి రూరల్: తమ ఆంగ్ల ఉపాధ్యాయిని పాఠాలు చెప్పకుండా కాలక్షేపం చేస్తున్నారని యలమంచిలి తులసీనగర్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్-2 విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లిష్ టీచర్ చింతల రాధారాణి స్థానంలో వేరొక టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్కూల్‌లో వారు తరగతులు బహిష్కరించి తమకు న్యాయం చేయాలని బైఠాయించారు. వీరి ఆందోళనకు స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మద్దతు పలికారు. విద్యార్థినులంతా ఇంగ్లిష్ టీచర్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆమె వ్యవహారశైలిపై పాఠశాల హెచ్‌ఎం, యలమంచిలి డీవైఈవోలకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోకుండా తమ భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన విద్యార్థినులు డిప్యూటీ తహసీల్దార్ మురళీబాబుకు ఫిర్యాదు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

అచ్యుతాపురం(మునగపాక): రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం అచ్యుతాపురంలో బ్లాక్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మెజార్టీ కోల్పోయినా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను అమలులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించిందన్నారు. కనీస వేతనాలు, బోనస్ లెక్కింపు వంటివి కోడ్స్‌లో ఉన్నాయన్నారు. కార్మికులతో చర్చించి వారికి అనుకూలంగా చట్టాలు చేయాలన్నారు. అలాకాకుండా ఉన్న చట్టాలను తీసివేసి యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా చట్టాల కోసం పోరాటం చేయాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ కె.సోమునాయుడు, పైడిరాజు, వసంత, రమణ, దుర్గేష్ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్

రాంబిల్లి (యలమంచిలి): లేబర్ కోడ్స్ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రాంబిల్లిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం పరిశ్రమ యజమానులకు కొమ్ముకాస్తూ లేబర్ కోడ్ తేవడం తగదన్నారు. ఇటువంటి ప్రతిపాదనలు చేపడితే కార్మికుల నుంచి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎం.నారాయణరావు, కాసియా, వై.రాము, నేవీ నిర్మాణ కార్మికులు, ముఠా కార్మికులు, కొబ్బరి ఒలుపు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవం

నక్కపల్లి: గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ సంజ్ఞా భాషల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దాని ఆవశ్యకత గురించి విద్యార్థులకు ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయిని యాస్మిన్ వివరించారు. బధిరులు(చెవిటి, మూగవారు) అన్ని విషయాలు తెలుసుకోవాలన్నారు. సాధారణ విద్యార్థులు మాదిరిగానే పాఠశాలలో బధిరి విద్యార్థులు విద్య అభ్యసిస్తారన్నారు. ముఖ, అవయవ కదలికలు ద్వారా వారు దేనికైనా సమాధానం చెబుతారన్నారు. సమ్మిళిత విద్యా బోధన ద్వారా వారికి తర్ఫీదు ఇవ్వడం జరుగుతోందన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యనభ్యసిస్తున్న బధిర విద్యార్థులు

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

మునగపాక: స్థానిక నందీశ్వర ప్రాంగణంలో ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలను విజయవంతం చేయాలని మునగపాక ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ కోరారు. మునగపాకలో మరిడిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా నిర్వహించే పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన గ్రామ పెద్దలతో కలిసి సోమవారం పరిశీలించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించే పోటీలను ఫ్లడ్ లైట్ల వెలుతురులో ప్రతి ఒక్కరూ వీక్షించేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విజేతలకు రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల వంతున బహుమతులు అందజేస్తామన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌ల ప్రోత్సాహంతో మునగపాక పంచాయతీ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో పెద్దలు కర్రి సాయికృష్ణ, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట విజయ్, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీనివాసరావు(నెట్), వెలగా రామకృష్ణ, రాజాన బుజ్జి, కేపీ రావు, దాడి మురళి, ఆడారి లక్ష్మణరావు, పీలా శివ పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఎలా?

విద్యుత్ ఏఈపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అసహనం

యలమంచిలి రూరల్: కొత్తపేట వీధిలో చెరువు గట్టుపై ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు రహదారులపై రాకపోకలకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించొద్దని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. యలమంచిలి పట్టణంలో సోమవారం ఆయన పర్యటనలో స్థానికులు పై సమస్యను ప్రస్తావించగా, వెంటనే విద్యుత్ శాఖ ఏఈ కనకరాజుతో మాట్లాడారు. మున్సిపల్ శాఖ అధికారులకు తెలియకుండా ఎక్కడపడితే అక్కడ స్తంభాలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. గతంలోనూ మీ తీరు వివాదాస్పదంగా ఉందంటూ అసహనం వ్యక్తం చేశారు. అనకాపల్లి ఈఈ, ఏపీఈపీడీసీఎల్ సీఎండీలకు ఫోన్ చేసి ఇక్కడ్నుంచి వీలైనంత త్వరగా ఏఈని బదిలీ చేయాలని కోరారు.



ఏఈపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. సోమవారం ఆయన అచ్యుతాపురం జంక్షన్‌కు నాలుగు వైపులా పరిశీలించారు. కూడలిలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేయకుండా చూడాలని సీఐ గణేష్‌కు సూచించారు. జనసేన పార్టీ నేత ద్వారపురెడ్డి బాబ్జీ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

కోటవురట్ల: మండలంలో రహదారులు ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో ఇవి దారుణంగా తయారయ్యాయి. అడుక్కో గొయ్యి వాహనదారులను బెంబేలెత్తిస్తున్నాయి. చినుకు పడితే చాలు గోతులు చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం తప్పదు. చీకట్లో మరింత ఇబ్బంది పడుతున్నామని వారు వాపోతున్నారు. అన్నవరం, రాజుపేట, చౌడువాడ వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



గోతులతో అన్నవరం రహదారి

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక జంక్షన్ వద్ద సోమవారం రాత్రి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పలు వాహనాలు రహదారిపై నిలిచిపోయాయి. మునగపాక కృష్ణంరాజు కాలువపై బ్రిటిష్ కాలం నాటి బ్రిడ్జిపై ఎదురెదురుగా రెండు వాహనాలు రావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో రహదారికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మునగపాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.



మెయిన్‌రోడ్డులో నిలిచిన వాహనాలు